1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 48 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 19 ఫిబ్రవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 19 Februry 2025 PAGES : 8 PRICE : 5/-




# బలప్రదర్శనకు జనసేన

- మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు.
- ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది
- ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే

**విజయవాడ**

జనసేన ఆవిర్భావ వేడుకలు పిఠాపురంలో జరగనున్నాయి. మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ సంధర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా జనసేన అధినాయకత్వం ప్రణాళిక రూపొందించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇంతకు ఈ సభ బలనిరూపణ కోసమా? వాస్తవంగా ఆవిర్భావ సభనే అంటూ రాజకీయ విశ్లేషకులు పెద్ద స్థాయిలో చర్చ సాగిస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే. వెంటీలేటర్ పై ఉన్న టీడీపీకి బీజేపీతో జతచేయించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఊపిరి అందించారని పలువురి అభిప్రాయం. ఇదే మాటను పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా చెప్పకనే చెప్పారు. అయితే కూటమి ఏకంగా 164 సీట్లలో - మిగతా3లో

# అద్భుతంగా కుంభమేళా

- సనాతన ధర్మంపై కామెంట్లు చేయడం ఈజీనే... కానీ...!
- మహా కుంభ్ ను మృత్యు కుంభ్ అని పేర్కొన్న మమతా బెనర్జీ
- హిందూ మతంపై చాలా సులభంగా కామెంట్లు చేస్తుంటారన్న పవన్
- ఇతర మతాలపై ఇలా వ్యాఖ్యలు చేయరని వెల్లడి
- దుర్ఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరు కదా అని స్పష్టీకరణ
- యోగి సర్కారు కుంభమేళాను అద్భుతంగా నిర్వహిస్తోందని కితాబు
- కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించిన పవన్ కల్యాణ్.
- భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకిరా నందన్‌లతో కలిసి వచ్చిన పవన్



**ప్రయాగరాజ్**

యూపీలోని ప్రయాగరాజ్ లో కుంభమేళాలో పాల్గొన్న సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను జాతీయ మీడియా పలకరించింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మహా కుంభ్ ను మృత్యు కుంభ్ గా అభివర్ణించడం పట్ల పవన్ స్పందించారు. ఈ వ్యాఖ్యలు చాలా తప్పు అని ఖండించారు. "సనాతన ధర్మంపై, హిందూ ధర్మంపై చాలా సులభంగా వ్యాఖ్యలు చేస్తుంటారు... అదే మన నాయకులతో వచ్చిన సమస్య. వారు హిందూ మతంపై చేసినంత సులభంగా ఇతర మతాలపై వ్యాఖ్యలు చేయరు. ఇలాంటి ధోరణి ఉన్న నాయకులతో కష్టమే. తమ వ్యాఖ్యలతో కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నామని వాళ్లు తెలుసుకోరు. కుంభమేళాలో కొన్ని ఘటనలు జరిగాయంటే అది నిర్వహణా వైఫల్యం అనలేం. కోట్లాది మంది తరలివచ్చే- మిగతా3లో



## అర్ధరాత్రి నిర్ణయం సరికాదు

- సీఈసీ ఎంపికపై విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవప్రదమైన చర్య
- కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం.

# ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదు



- తప్పు చేసిన వారిని బట్టలూడదీసి నిలబెడతాం
- ఏపీలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డర్
- తప్పు చేయకపోయినా వల్లభనేని వంశీని అరెస్టు చేశారు
- టీడీపీ ఫిర్యాదులో ఆయన పేరు ఎక్కడా లేదు
- జైలులో వంశీతో ములాఖత్ తర్వాత మీడియాతో వైసీపీ అధినేత జగన్

**విజయవాడ**

అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన వారినెవ్వరినీ వదలిపెట్టనని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి హెచ్చరించారు. అరెస్టు అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం అక్కడే ఆయన మీడియాతో మాట్లాడారు.. అన్యాయాలు చేసిన వారిని బట్టలూడదీసి నిలబెడతామని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూలిపోతోందని, ప్రతీ చోటా కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబుకు వల్లభనేని వంశీని చూస్తే ఆక్రోశం వస్తోందని వైయస్ జగన్ పేర్కొన్నారు. వంశీపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారు. - మిగతా3లో

# మహా కుంభ్‌కాదు.. మృత్యుకుంభ్



- సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు
- 'కుంభమేళాకు వెళ్లి భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు
- యూపీ సర్కార్ వీఐపీల కోసమే ఏర్పాట్లు చేసింది
- సామాన్యుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు
- నేను మహా కుంభమేళాను గంగామాతకు గౌరవ సూచికంగా భావిస్తున్నాను

# ఏపీలోని యూనివర్శిటీలకు వీసీల నియామకం

## నోటిఫికేషన్ విడుదల చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లోని పలు యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. విశాఖపట్నంలో ఉన్న ఆంధ్రా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర ఆచార్యునిగా చేస్తున్నారు. కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను నియమించారు. ప్రస్తుతం ఆమన వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. యోగి వేమన వర్సిటీకి వీసీగా ప్రొఫెసర్‌గా పి.ప్రకాశ్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన హెచ్‌సీయూ, స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్‌లో బయో టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరంతా మూడేళ్లపాటు ఆయా వర్సిటీలకు వీసీగా కొనసాగనున్నారు. నూతనంగా నియమించిన - మిగతా3లో



# ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదు

-మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో గన్నవరం టీడీపీ కార్యాలయంలో దాడి జరిగిందని చెప్పి ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తి గన్నవరం టీడీపీ ఆఫీస్ లో పనిచేస్తున్న ఈ వ్యక్తి సాక్షాత్తు తానే జడ్జ్ గారి సమక్షంలో, జడ్జ్ ఇచ్చిన సమన్లతో, పోలీసుల నుంచి సమన్లు అందుకుని, న్యాయస్థానం ముందుకు వచ్చి జడ్జ్ ముందు హాజరై వాగ్మూలం ఇచ్చారు. ఆ వాగ్మూలంలో ఆయన వంశీ ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినప్పటికీ కూడా వంశీపై తప్పుడు కేసును బనాయించారు. 2023, ఫిబ్రవరి 19న మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో పట్టాభి అనే వ్యక్తితో వంశీపై భరించలేని విధంగా చంద్రబాబు బూతులు తట్టించారు. మర్నాడు ఫిబ్రవరి 20న చంద్రబాబు నేరుగా గన్నవరంకు పట్టాభిని పంపారు. అక్కడ పట్టాభి మళ్ళీ ప్రెస్ మీట్ పెట్టి వల్లభనేని వంశీని తిట్టారు. అ తర్వాత అక్కణ్నుంచి ఒక ప్రదర్శనగా వెళ్లి వైయస్ఆర్‌సీపీ కార్యాలయం చేరుకుని అక్కడ, శీనయ్య అనే దళిత సర్పంచ్‌పై దాడి చేశారు. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన గన్నవరం సీఐ కనకారావుపైనా టీడీపీ మూకలు దాడి చేశాయి. పట్టాభి, ఆయన అనుయాయులు సీఐ కనకారావు తల పగలగొట్టారు. ఆ ఘటన తర్వాత పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అయితే అప్పుడు మేమే అధికారంలో ఉన్నా ఏకపక్షంగా వ్యవహరించలేదు. పోలీసులు సుమోటోగా తెలుగుదేశం వారితో పాటు వైయస్ఆర్ సీపీ వారిపైనా కూడా కేసులు పెట్టారు. అందులో ఎక్కడా వల్లభనేని వంశీ పేరు లేదు. కారణం వంశీ ఘటనా స్థలంలో లేరు.

ఇది జరిగిన రెండు రోజుల తరువాత గన్నవరం టీడీపీ ఆఫీస్‌లో డీటీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న సత్యవర్ధన్ అనే దళిత యువకుడిని మంగళగిరిలోని టీడీపీ ఆఫీస్ కు చంద్రబాబు మనుషులు పిలిపించారు. అక్కడ సత్యవర్ధన్ తో తెల్లకాగితంపై సంతకం తీసుకుని మరో ఫిర్యాదు ఇప్పించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఆ కేసులోనూ ఎక్కడా వంశీ పేరు లేదు. కారణం వంశీ ఆ ఘటనా స్థలంలో లేరు కాబట్టి. 2023 ఫిబ్రవరి 23న పోలీసులు సత్యవర్ధన్ నుంచి 161 స్టేట్ మెంట్ రికార్డు



చేశారు. ఈ స్టేట్‌మెంట్ లో కూడా ఎక్కడా వంశీ పేరు లేదు. ఘటన జరిగినప్పుడు తాను అక్కడ నుంచి వెళ్ళిపోయాను అని కూడా చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే వంశీని టార్గెట్ చేయడం మొదలుపెట్టారు. 2024 జూలై 10న ఆ కేసు రీఓపెన్ చేశారు. వంశీపై చంద్రబాబు పెట్టుకున్న ఆక్రోశం, కోపం ఏ స్థాయిలో ఉందంటే, ఎలాగైనా సరే వంశీని ఈ కేసులో ఇరికించాలని, వంశీ ఘటనా స్థలంలో లేకపోయినా కూడా, ఆయన్ను ఈ కేసులో 71వ నిందితుడిగా చేర్చారు. మొత్తం 94 మందిపై కేసు పెడితే, నెలలు తరబడి వైయస్ఆర్ సీపీ వారిని వేధించాలని ఇంకా 44 మందికి బెయిల్ రాకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సత్యవర్ధన్ మేజిస్ట్రేట్ ముందు హాజరై వాగ్మూలం ఇస్తే, మిగతా వారికి కూడా బెయిల్ వస్తుందనే ఉద్దేశంతో చంద్రబాబు, లోకేశ్, పోలీసులు కలిసి కుట్రపన్నారు. ఒక మనిషి తప్పు చేస్తే అతడిని శిక్షిస్తే పోలీసులకు ఒక గౌరవం ఉంటుంది. కానీ నేడు రాష్ట్రంలో తమకు నచ్చని వారిపై దొంగ సాక్ష్యాలు సష్టించి, దొంగ కేసులు పెట్టి నెలల తరబడి జైలులో పెడుతున్నారు.

**పోలీసులూ గుర్తుంచుకోండి:**

పోలీసులను ఇష్టానుసారంగా వాడుకుని ప్రజాస్వామ్యంకు తూట్లు పొడుస్తున్నారు. ఈరోజు ప్రతి పోలీస్ కు చెబుతున్నాను, మీ టోపీల కనిపించే ఆ మూడు సింహాలకు సెల్యూట్ కొట్టండి, కానీ తెలుగుదేశం నాయకులకు కాదు. వారు చెప్పినట్లు చేయడం మొదలు పెట్టి అన్యాయాలు చేస్తే ఎల్లకాలం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే ఉండదని ప్రతి అధికారికి తెలియచేస్తున్నాను. రేపు మా అధికారం వస్తుంది. అన్యాయం చేసిన ఈ అధికారులు, నాయకులను బట్టలు ఊడదీసి నిలబెడతామని తెలియచేస్తున్నాను. ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదు. ఇదే వంశీని అరెస్ట్ చేసేప్పుడు సీఐ అన్నడంట. నేను ఒకటిన్నర సంవత్సరాల తరువాత రిటైర్ అవుతాను అని. రిటైర్ అయినా కూడా, సప్త సముద్రాల అవతల ఉన్నా కూడా, మొత్తం అందరినీ పిలిపిస్తాం. చట్టం ముందు నిలబెడతాం. బట్టలు ఊడదీస్తాం అని జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు.

# బలప్రదర్శనకు జనసేన...

-మొదటిపేజీ తరువాయి

విజయఢంకా మోగించింది. ఆ తర్వాత సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ లు భాద్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 8 నెలల పాలనా కాలాన్ని పూర్తి చేసుకుంది. అయితే ప్రభుత్వం వరకు ఓకే గానీ, కూటమిలోని పార్టీలు మాత్రం ఎవరి బలాన్ని వారు పెంచుకొనే పనిలో పడ్డారని చెప్పవచ్చు. ఇటీవల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించగా, ఊహించని స్థాయిలో కోటికి పైగా సభ్యత్వ నమోదు సాగింది. అలాగే వైసీపీ నుండి వచ్చిన పలువురు నాయకులకు టీడీపీ వెల్ కమ్ చెప్పింది. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఏమాత్రం వెనక్కు తగ్గినా ఊరుకొనే ప్రసక్తే లేదని ఇప్పటికే పలుమార్లు తమ ఎమ్మెల్యేలకు చంద్రబాబు క్లాస్ తీసుకున్నారు. మొత్తం మీద టీడీపీని మరింత బలోపేతం చేసేలా ఓ వైపు చంద్రబాబు, మరోవైపు నారా లోకేష్ తమ రాజకీయ పావులు కదుపుతున్నారు. ఇక కూటమిలో రెండో పార్టీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీ జనసేన. ఇప్పటి వరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వ పాలనా పరమైన అంశాలపై దృష్టి సారించారు. అలాగే జనసేనలో నెంబర్ ? 2 గా గల నాదెండ్ల మనోహర్ కూడా మంత్రి వర్గంలో ఉండడంతో పార్టీ క్యాడర్ కు అంతగా అందుబాటులో లేరని ప్రచారం. మరో జనసేన కీలక నేత, పవన్ సోదరుడు నాగబాబు పార్టీ వ్యవహారాలను చూస్తూ వస్తున్నారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో పార్టీలో చేరికల నేపథ్యంలో నాగబాబు హాజరై, పార్టీలోకి వారిని సాదరంగా స్వాగతించారు. ఈ దశలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మరికొందరు నేతలకు జనసేన కూడా స్వాగతం పలికింది. ఓ వైపు కోటికి పైగా సభ్యత్వ నమోదు పూర్తి చేసుకొని టీడీపీ క్యాడర్ హుషారుగా ఉండగా, ప్రస్తుతం జనసేన బలాన్ని కూడా పెంచుకోవాలన్న లక్ష్యం పార్టీ అగ్ర నాయకత్వంలో కనిపిస్తోంది. ఈ సందర్భంగానే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పవన్ సిద్ధమయ్యారు. ఎన్నికల్లో తమ పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందుకున్న తర్వాత నిర్వహిస్తున్న తొలి పార్టీ సమావేశం ఇది. ఈ భారీ బహిరంగ సభ ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకొనేలా పవన్ ప్లాన్ చేసినట్లు టాక్ నడుస్తోంది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు ఇప్పటి నుండే ఆయా జిల్లాల పార్టీ నాయకులకు తగు సూచనలు చేసినట్లు సమాచారం. ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసి, మళ్ళీ యావత్ దేశం దృష్టి ఆకర్షించేలా చేయాలన్నది పవన్ అభిమతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా విస్తృతం చేసి, పార్టీ క్యాడర్ కు ఇప్పటి నుండి అందుబాటులో ఉండాలని పవన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు ప్రతి గ్రామంలో క్యాడర్ ఉండాలన్నది పవన్ అభిమతమట. మొత్తం మీద పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ.. బల నిరూపణ సభ కానుందని రాజకీయ విశ్లేషకుల మధ్య తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది.

# భయపెడుతున్న జీబీఎస్

**గుంటూరు :** ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లికి చెందిన కమలమ్మ అనే వృద్ధురాలు జీబీఎస్‌తో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. 13 రోజుల పాటు చికిత్స పొందిన బాధితురాలు.. పరిస్థితి విషమించడంతో కన్నుమూసింది. మరో బాధితురాలు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జీబీఎస్ లక్షణాలతో శ్రీకాకుళం జిల్లా గోదాయవలసకు చెందిన యువంత్ అనే బాలుడు.. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆ గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి..అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే జీబీఎస్ అంటు వ్యాధి కాదని..ఇన్ఫెక్షన్ల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని సూచిస్తున్నారు. అరుదుగా లక్షమందిలో ఒకరిద్దరికే వచ్చే జీబీఎస్ అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఏపీలో ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు ప్రభుత్వాసుపత్రికి ఈ నెల 11న ఒక్కరోజే ఏడు కేసులు వచ్చాయి. వారిలో ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఇదే వ్యాధితో కాకినాడలో ఇటీవల ఇద్దరు చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ వ్యాధితో 17 మంది చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో ఒక్కసారిగా జీబీఎస్ కేసులు పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తమయింది. జీబీఎస్ కేసులపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు..ప్రభుత్వ యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలని సూచించారు.ఏపీ వ్యాప్తంగా గత ఏడాది 301 జీబీఎస్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ 43 కేసులను గుర్తించినట్టు చెప్పారు..మంత్రి సత్యకుమార్. ప్రస్తుతం 17 మంది బాధితులు చికిత్స పొందుతున్నారని వివరించారు. 85 శాతం మందికి చికిత్స అవసరం లేకుండానే ఈ వ్యాధి తగ్గుతుందని..కేవలం 15 శాతం మందికి మాత్రమే చికిత్స అవసరమవుతుందని




చెప్పారు..సత్యకుమార్. ఈ వ్యాధికి అవసరమైన చికిత్స సదుపాయాలతో పాటు వ్యాక్సిన్లు కూడా సరిపడా ఉన్నాయని..ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఖర్చు గురించి ఎక్కడా ఆలోచించకుండా.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తగినన్ని ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుతోందని స్పష్టం చేశారు. కరోనాలో జీబీఎస్ అంటు వ్యాధి కాదని.. జెనెటికల్ కూడా కాదని స్పష్టం చేశారు..ఏపీ హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు. వ్యాధికి కచ్చితమైన కారకాలపై ఎలాంటి నిర్ధారణ లేదని..ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జీబీఎస్ ఉందన్నారు. లక్షల్లో ఒకరికి మాత్రమే జీబీఎస్ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని..వచ్చిన వారిలో కూడా 5 నుంచి 7 శాతం మాత్రమే మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఒక్కసారిగా కాళ్లు చచ్చుబడినట్టు అనిపిస్తే..వెంటనే వైద్యులను సంప్రదించాలి..వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని వివరించారు. గులియన్ బారే సిండ్రోమ్ అంటువ్యాధి కాకపోయినా.. అప్రమత్తంగా ఉండాల్సిదే. అయితే గతంలో పెద్దవారిలో మాత్రమే కనిపించే ఈ వ్యాధి.. ఇప్పుడు పిల్లలు, శిశువులకూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. నూటికి 95 శాతం మంది వ్యాధిగ్రస్తుల్లో ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా..సకాలంలో చికిత్స అందించకపోతే ప్రమాదం. ఇది ఒకరకంగా పక్షవాతం లాంటిదే. చాలావరకు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు వచ్చినవారికే మొదలవుతుంది. వ్యాధి తీవ్రమైతే కండరాలు చచ్చుబడతాయి. వ్యాధి లక్షణాల్ని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయవచ్చు. వేళ్లు, మడమలు, మణికట్టు వంటి చోట్ల సూదులతో పొడుస్తున్నట్లు అనిపించడం.. కాళ్లలో మొదలైన బలహీనత పైకి విస్తరించడం, కాళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది అవుతుంది. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందించాల్సి ఉంటుంది. నర్వ్ కండక్షన్, ఎలక్ట్రోమయోగ్రఫీ, సీఎస్ఎఫ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలతో.. వ్యాధిని నిర్ధారిస్తారు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే ఛాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే..కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకట్రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది. ఇతర ఇన్‌ఫెక్షన్లు వచ్చినా, కలుషితమైన నీరు, ఆహారం తీసుకున్నా ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం..కాచి, వడబోసిన నీళ్లను తాగడం..ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం వంటి చర్యలతో వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

## ఏపీలోని యూనివర్శిటీలకు వీసీల నియామకం

-మొదటిపేజీ తరువాయి

వీసీల వివరాలు ఇలా..

హెచ్.సుదర్శనరావు (అనంతపురం జేఎన్‌టీయూ), వెంకట బసవరావు ( రాయలసీమ వర్సిటీ), ఉమా (పద్మావతి మహిళా యూనివర్సిటీ), కె.రాంజీ (కృష్ణా యూనివర్శిటీ, మచిలీపట్నం), ప్రసన్న శ్రీ ( ఆదికవి నన్నయ యూనివర్సిటీ), అల్లం శ్రీనివాసరావు ( విక్రమ సింహపురి యూనివర్సిటీ).

## అద్భుతంగా కుంభమేళా



-మొదటిపేజీ తరువాయి

ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత క్లిష్టమైన సవాల్ గా నిలుస్తుంది. దుర్ఘటనలు, దురదృష్టకర ఘటనలు జరగాలని ఎవరూ కోరుకోరు కదా. నాకు తెలిసినంతవరకు యోగి ప్రభుత్వం కుంభమేళాను అద్భుతంగా నిర్వహిస్తోంది. కొన్ని సంఘటనలు జరగడం దురదృష్టకరం. ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నేతలకు చెబుతున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని నా అభిప్రాయం" అంటూ మమతా బెనర్జీ వ్యాఖ్యలను పవన్ తప్పుబట్టారు.



**కుంభమేళా పవిత్ర సంగమంలో పుణ్య స్నానాలు చేసిన పవన్ కళ్యాణ్ దంపతులు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రయాగ రాజ్ త్రివేణి సంగమంలో మహకుంభ మేళా సందర్భంగా కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాదు నుంచి నేరుగా ఆయన సతీసమేతంగా ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమం చేరుకున్నారు. పవన్ సతీమణి అన్నా లెజినోవా, కుమారుడు అకిరానందన్ తదితరులు అక్కడ పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహా కుంభమేళాలో... పితృదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాకు రావడం తన అదృష్టమని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా పుణ్యస్నానం చేసి తరించాలని ఆయన సూచించారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన సతీమణి, కుమారుడు అకీరానంద్ తో పాటు మిత్రులు, ప్రముఖ సినీ దర్శకులు తివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఉన్నారు.

# టీడీపీ టార్గెట్‌లో మరో ఇద్దరు వైసీపీ నేతలు

**విజయవాడ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఎనిమిది నెలల తర్వాత వైసీపీ కీలక నేతల అరెస్ట్ లు ప్రారంభమయ్యాయి. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను ఒక మర్డర్ కేసులో జైలుకు పంపారు. అదే సమయంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సయితం నెల్లూరు జైలు లో కొద్ది రోజులు ఉండి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. తాజాగా వల్లభనేని వంశీ అరెస్ట్ కావడంతో తర్వాత గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. కొడాలి నాని ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని అంటున్నారు. తాజాగా మరో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేరు కూడా అదే స్థాయిలో వినపడుతుండటం విశేషం.వెల్లంపల్లి శ్రీనివాస్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేసి కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు. దీంతో పాటు ఆయనపై అనేక కేసులు నమోదు కావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిసింది. మంత్రిగా ఉన్న సమయంలోనూ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుర్గగుడి లో జరిగిన అవినీతిపై అనేక ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వెల్లంపల్లి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసే అవకాశముంది. దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించడంలో ఒక బృందం బిజీగా ఉందని చెబుతున్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేస్తున్నారు.వెల్లంపల్లి శ్రీనివాస్ అనేక పార్టీలు మారారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 లో ఆయన విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్ లో ప్రజారాజ్యం విలీనం చేయడంతో వెల్లంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ లో చేరిపోయారు. తర్వాత బీజేపీలో చేరారు. అనంతరం వైసీపీలో చేరి 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత జగన్ కేబినెట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేశారు. పవన్ కల్యాణ్ పై వ్యక్తిగతంగా విమర్శలకు దిగడంతో జనసైనికుల ఆగ్రహానికి గురయ్యారు. జగన్ ప్రాపకం సంపాదించడం కోసమే వెల్లంపల్లి శ్రీనివాస్ ఈ రకమైన వ్యాఖ్యలు చేశారన్న టాక్ ఉంది.

# హామీల అమలు కోసం క్యాలెండర్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. వరసగా హామీలను అమలు చేయాలని నిర్ణయించింది. వచ్చే నెల నుంచి ఇక సూపర్ సిక్స్ హామీల అమలు నెలకొకటి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి పెరిగింది. కేవలం రాజధాని నిర్మాణాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, తమ గోడును పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక నేతల వద్ద కూడా ప్రజలు ఇదేరకమైన అభిప్రాయాన్ని వెళ్ల గక్కతుండటంతో ఇక వరసగా హామీలు అమలు చేయాలని నిర్ణయించారు.ముందుగా మార్చి నెల నుంచి అంటే ఉగాది నాటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరించే పద్ధతులను అధ్యయనం చేసి వచ్చిన మంత్రుల కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదిక అందించింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# భక్తులకు అసౌకర్యం కలగుండా చూడాలి

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 18)

మహాశివరాత్రి సందర్భంగా భైరవకోనకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న మహాశివరాత్రి పండుగ జరగనుంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల నుండి భక్తులు భారీగా భైరవకోనకు ప్రతి ఏటా వస్తుంటారు. మునుపెన్నడూ లేని విధంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం అధికారులతో ఎమ్మెల్యేడాక్టర్ ఉగ్ర భైరవకోనలోని అన్ని ప్రాంతాలను పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే భైరవకోనలో ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి వసతితో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని

4

# సరైన అవగాహన, సత్వర వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

సరైన అవగాహన, సత్వర వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఈ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన కోసం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, బహిరంగ సభలో సినీ నటి, లైఫ్ ఎగెయిన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు గౌతమితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులను ఎదుర్కోవటం నేడు పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో 17 శాతం క్యాన్సర్‌కు సంబంధించిన వేనని అన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి సంతకాలు చేసిన రెండు ఫైళ్లలో ఒకటి క్యాన్సర్‌కు సంబంధించినది కాగా, మరొకటి ఆర్.బీ.ఎస్.కేకు సంబంధించిన ఫైలు అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మూడు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 14న ప్రక్రియ ప్రారంభించామన్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ (తరువాయి 4లో...)

# పేదల వైద్యం, ఆరోగ్యం పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

## కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలోనే రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు చర్యలు

## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 18)

కూటమి ప్రభుత్వం పేదల వైద్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కొండపిలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి ఆస్పత్రిలోని అన్ని వార్డులు తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు రికార్డులు పరిశీలించి, అక్కడ అందుతున్న సేవల గురించి మంత్రి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగిన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల వైద్యం ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంత ఖర్చు నైనా భరిస్తోందని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కొండపి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన పరికరాల్ని సమకూర్చి త్వరలోనే ఇక్కడే ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. దీనివల్ల ప్రజలపై ఆర్థిక భారం తగ్గి జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డు

4

# న్యాయవాది నిర్వాకం!

## సర్పంచ్‌ను నమ్మించి నిధులు స్వాహా

## రూ.35 లక్షల నిధుల స్వాహా పై నేడు మళ్ళీ విచారణ

(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, ఫిబ్రవరి 18)

న్యాయాన్ని కాపాడేందుకు ప్రయత్నించాల్సిన ఓ న్యాయవాది అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఆ న్యాయవాది బంధువు అయిన సర్పంచ్ సంతకానికే పరిమితమం కావడంతో ఆ న్యాయవాది అవినీతికి అడ్డూ, అదుపూ లేకుండా పోయింది. కొందరు అధికారులతో కుమ్మక్కై పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించి రూ.35 లక్షల వరకు కొల్లగొట్టాడు. పంచాయతీ నిధుల దుర్వినియోగం పై విచారణ అధికారి పీసీపల్లి సచివాలయానికి వచ్చే వరకు పీసీపల్లి పంచాయతీలో అవినీతి జరిగిన విషయం సర్పంచ్ మరియమ్మకు తెలియని పరిస్థితి. పీసీపల్లి సర్పంచ్‌గా తాళ్ళూరి మయమ్మ ఉన్నారు. ఆమె సర్పంచ్‌గా ఎన్నికైన మూడు నెలలకే ఆమె భర్త అకాల మరణం పొందాడు. దీంతో పంచాయతీ బాధ్యతలను తాను చూసుకుంటానని ఆమె సమీప బంధువైన న్యాయవాది మోహన్ సర్పంచ్‌ను కోరాడు. న్యాయవాది అయిన మోహన్ పంచాయతీ పాలన సక్రమంగా చేసి తన కుటుంబానికి మంచి పేరు తీసుకువస్తాడనే నమ్మకంతో సర్పంచ్ టోకన్ కూడా మోహన్‌కే అప్పగించారు. టోకన్ మోహన్ వద్ద ఉండడంతో ఆయన అధికారులతో కుమ్మక్కై మంచినీటి పథకాలు మరమ్మతులు చేయకుండా చేసినట్లు, కొత్త బోర్లు బిగించకుండా బిగించినట్లు, మట్టి రోడ్లు వేయకుండానే వేసినట్లు ఎంబుక్‌లు రికార్డులు చేయించుకుని రూ.35 లక్షల వరకు పంచాయతీ నిధులు స్వాహా చేశారు. జనరల్ ఫండ్ నిధులను సైతం తన సొంత డబ్బులాగా అధికారులతో కుమ్మక్కై డ్రా చేశారు. ఈ అవినీతి భాగోతం సర్పంచ్ మరియమ్మకు తెలియకపోవడం గమనార్హం. పంచాయతీలో జరిగిన అవినీతిని తెలుసుకున్న స్థానికులు ఆర్‌టిఐ యాక్టు ద్వారా సమగ్ర సమాచారం తీసుకున్నారు. పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు గుర్తించిన స్థానికులు నిధుల దుర్వినియోగం పై జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈ నెల 14న డిఎల్‌పిఓ హనుమంతరావు పీసీపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పంచాయతీలో మంచి పేరున్న తాళ్ళూరి మరియమ్మ కుటుంబ సభ్యులకు ఇంత అవినీతి జరిగిందని తెలియడంతో ఆందోళనకు గురయ్యారు. న్యాయవాది మోహన్ పై నమ్మకం పెట్టుకోవడం వల్ల చెడ్డ పేరు మూటగట్టుకోవాల్సి వచ్చిందని సర్పంచ్ మరియమ్మ, ఆమె మామ తాళ్ళూరి మోషేలు ఆవేదన వ్యక్తం చేశారు. పంచా యతీలో పని చేసే పారిశుధ్య కార్మికులకు కూడా వైసీపీ పాలనలో జీతాలు ఇవ్వని పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో జీతాలు చెల్లించారు.



### నేడు పనుల పరిశీలన

ఎంబుక్‌ల ప్రకారం విచారణ అధికారి హనుమంతరావు మంగళవారం పీసీపల్లిలో పను లను పరిశీలించాల్సి ఉంది. కానీ భైరవకోనలో ఎమ్మెల్యే ఉగ్ర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంకు ఆయన హాజరు కావడంతో పనుల పరిశీలన బుధవారం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి సౌజన్య షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు.

# వైపాలెంలో తహసిల్దార్ సస్పెండ్

## అదే బాటలో వీఆర్వో సర్వేయర్

## లోతైన దర్యాప్తు జరిపిస్తే మరిన్ని అవినీతి, అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశం

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 18)




యర్రగొండపాలెం మండలంలో తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఏ బాలకిషోర్‌తో పాటు యర్రగొండపాలెం 2 వీఆర్వో యల్లయ్య, సర్వేయర్ దిలీప్‌లు అక్రమంగా ఒకరి భూమి మరొకరికి ఆన్లైన్ చేసేందుకు ధ్రువీకరించడంతో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీప్ వెంకట త్రివినాగ్ ఇటీవల యర్రగొండపాలెంలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. రెవిన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఇతర రెవెన్యూ సిబ్బంది చేత స్టేట్మెంట్లు స్వీకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్ కి అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా ఎదుట జాతీయ రహదారి 565 నుంచి కొలుకుల రోడ్డుకు వెళ్లే సర్వేనెంబర్ 559లో రెండు ఎకరాలు ఆర్‌ఎంపి స్థలం ఉంది. ఈ భూమిలోని కొంత భాగంలో ఆర్ ఎం బి అధికారులు సీసీ రోడ్డు వేయగా మిగతాది. అంచుల కింద ఉండిపోయింది. బంగ్లా ఎదురుగా రోడ్డుకి ఉత్తరం వైపున ఖాళీ స్థలం గతంలోనే పంచాయితీ తాగునీటి బోరు నీటి ట్యాంకు ఏర్పాటు చేసింది. మిగతాది కాళీగా ఉంది ఎఫ్ఎంబి ప్రకారం బంగ్లా ప్రహరి నుంచి 117 లింకులు వెడల్పుతో రహదారి విస్తరించి ఉంది. అటు జాతీయ రహదారి ఇటు ఆర్‌ఎంపి సిసి రోడ్డుకు మాలుపులో ఉండటంతో దీని విలువ లక్షల్లో ఉంది. దీనితో కొందరి కళ్ళు ఈ భూమిపై పడ్డాయి పక్కనున్న 58/1 సర్వే నంబర్ తో ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. వీటిపై గ్రామ సర్వేర్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహసిల్దార్, సంతకాలు చేసి సీలు వేశారు. సదరు పత్రాలు ఆధారంగా దొడ్డపనేని శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్య పేరు పై గత నెల 22వ తేదీన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం బయటికి పొక్కటంతో అసలు హక్కుదారుల వారసులు తప్పుడు పత్రాలతో తమ విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో పాటు, జిల్లా కలెక్టర్ ని కలిశారు. దీనితో తీగ లాగితే డొంకంతా కదిలింది. ఈ క్రమంలో బాధ్యులైన తహసిల్దార్, సర్వేయర్, వీఆర్వోలను సస్పెండ్ చేశారు. కాగా ఈ వ్యవహారంలో మరికొందరు సస్పెండ్ అవుతారనే ప్రచారం బలంగా వినిపిస్తుంది. జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ జరిపితే మరిన్ని అవినీతి, అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. మరి ఆ దిశగా అధికారులు చర్యలు చేపడతారో లేదో వేచి చూడాలి.



# సరైన అవగాహన, సత్వర వైద్యంతో
# క్యాన్సర్‌ను జయించవచ్చు













ముఖద్వారము (సర్వైకల్) క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లో 4.7 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు కేవలం 95 లక్షల మంది మాత్రమే ఈ పరీక్షలు చేయించుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఆయన వ్యాఖ్యానించారు. క్యాన్సర్లలో 63% నివారించుకోవచ్చు అని, మిగతా 37% జన్యుపరమైన కారణాల వలన నివారణ కష్టం అన్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 37 వేల మందికి నోటి, 26 వేల మందికి పైగా గర్భాశయ ముఖద్వారం, 25 వేల మంది రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన అనుమానిత లక్షణాలు బయటపడ్డాయి అన్నారు. ప్రారంభ దశలో గుర్తించగలిగితే క్యాన్సర్‌ను జయించవచ్చని మంత్రి చెప్పారు. ఏడుగుండ్లపాడు గ్రామంలో 329 మందికి స్క్రీనింగ్ చేయగా 11 క్యాన్సర్ అనుమానత కేసులను గుర్తించామని, వీటిలో పది నోటికి సంబంధించినవి కాగా, ఒకటి రొమ్ముకు సంబంధించిన కేసు అని ఆయన తెలిపారు. అందుకే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలనే విషయంపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

**నాదీ క్యాన్సర్ బాధిత కుటుంబమే..**

చివరి దశలో క్యాన్సర్ ఉందని తెలిశాక ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ప్రయోజనం ఉండదని, అందుకే ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. నా తల్లీ, అక్కా క్యాన్సర్ కారణంగా మరణించినందునే రాష్ట్రంలో ఏ ఒక్క మహిళా క్యాన్సర్ తో మరణించకూడదన్న లక్ష్యంతో దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకే మంత్రిగా మీ ముందుకు వచ్చానని ప్రకటించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునేందుకు మహిళలు మొహమాట పడుతున్నారని ఆయన అన్నారు. క్యాన్సర్ ను జయించి ఈ వ్యాధిపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పిస్తున్న సినీనటి గౌతమి ని ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. క్యాన్సర్ పై అవగాహన, నివారణ కార్యక్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గుండెపోటు వస్తే వారి ప్రాణాలు నిలిపేలా గంటలోపే వేసేలా రూ.45 వేల విలువైన ఇంజక్షన్లను కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు మంత్రి చెప్పారు. దీనికి సంబంధించిన స్టెమీ కార్యక్రమంలో భాగంగా 1968 మంది ప్రాణాలను కాపాడగలిగామన్నారు.

**ధైర్యంగా ముందుకు...**

క్యాన్సర్ అని తెలియగానే నిరాశ, నిస్పృహలోకి జారిపోవడం సరికాదని సినీనటి గౌతమి అన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఎదురవుతున్న ఎన్నో పోరాటాలలో విజయం సాధిస్తున్న మీకు క్యాన్సర్ పైన విజయం సాధించడం పెద్ద కష్టమేమి కాదని ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. 25 ఏళ్ల క్రితం తన తల్లి చనిపోయారని, ఆ బాధలో ఉన్న తనకు మరో నాలుగేళ్లకే రొమ్ము క్యాన్సర్ వచ్చిందని గౌతమి చెప్పారు. అప్పటికి తన కుమార్తె వయసు ఐదేళ్ల లోపేనని అన్నారు. తల్లిని కోల్పోయిన తాను ఆ బాధ తన బిడ్డకు రాకూడదని ధైర్యంతో క్యాన్సర్ కు వైద్యం చేయించుకున్నానని తెలిపారు. శరీరంలో ఏమాత్రం మార్పు కనిపించినా నిర్లక్ష్యం చేయొద్దని, పరీక్షలు చేయించుకోవడంలో సిగ్గు పడరాదని ఆమె అన్నారు. సకాలంలో పరీక్షలు, సత్వర వైద్యం, మనో ధైర్యంతో క్యాన్సర్ పై తాను విజయం సాధించాలని తెలిపారు. ఈ దిశగా వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఉన్నందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు అదృష్టవంతులని ఆమె వ్యాఖ్యానించారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 4,07,85,186 మంది 18 ఏళ్లు నిండిన ప్రజలు ఉన్నారని, వీరిలో 94,99,268 మందికి ఇప్పటివరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 37 వేలకు పైగా నోటి, 24 వేలకు పైగా రొమ్ము, 26 వేలకు పైగా గర్భాశయ ముఖ ద్వార అనుమానిత కేసులను గుర్తించామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునే విషయంలో ప్రజల్లో అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలు కూడా సహకరించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు సహకరించాలని కోరారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ జీవనశైలి మార్చుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందటం ద్వారా క్యాన్సర్ ను అధిగమించవచ్చని చెప్పారు. ఈ దిశగా అవగాహన కల్పించేందుకు తమ నియోజకవర్గానికి వచ్చిన మంత్రి సత్య కుమార్, సినీనటి గౌతమి, జిల్లా యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్ నివారణకు అవసరమైన స్క్రీనింగ్ చేయించుకుంటామని స్థానికులతో ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ దిశగా ఏర్పాటు చేసిన పాయింట్ వద్ద అతిథులు సెల్ఫీ దిగారు. గ్రామంలో స్క్రీనింగ్ నిర్వహణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ కె శ్యామల, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు, డిఎంహెచ్ఓ టి వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ సూరిబాబు, ఆర్‌బీఎస్‌కెడిపిఎం డాక్టర్ భగీరథి, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, స్థానిక సర్పంచ్ శిల్ప సౌందర్య, ఇతర అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల వైద్యం, ఆరోగ్యం పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ





ఏర్పాటు చేస్తామని, రోగుల బెడ్ల వరకు ఆక్సిజన్ సప్లై కూడా అందిస్తామన్నారు. గుండెపోటుకు ఈ ఆస్పత్రిలోనే వైద్యులు ప్రథమ చికిత్స అందించేందుకు అన్ని పరికరాలు ఉన్నాయని, గుండెపోటుకు గురైన వారు సుదూర ప్రాంతాలకు వెళ్లేముందు ఇక్కడికి వచ్చి ప్రథమ చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి థియేటర్ లైట్ ని ఉచితంగా అందజేసిన రమేష్ సంఘమిత్ర ఆసుపత్రి యాజమాన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు. జీబీఎస్ వ్యాధి కొత్తగా వచ్చింది కాదని, దీనిపై ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. ఈ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరికైనా జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వైద్యులు వెంటనే జీజీహెచ్‌కి పంపించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

## భక్తులకు అసౌకర్యం కలగుండా చూడాలి





ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. త్రిముఖ దుర్గాదేవి ఆలయానికి భక్తులు పోటెత్తినా వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తే భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భైరవకోనలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ పూజారుల నుంచి వేద ఆశీర్వచనాలు అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తదుపరి ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన మహాశివరాత్రి మహోత్సవ ఆహ్వాన గోడ పత్రికను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ కేశవర్ధన్‌రెడ్డి, డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ భీమానాయక్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి వంశీకృష్ణారెడ్డి, డిఈలు విశ్వనాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి, డిఎల్‌పిఓ హనుమంతరావు, ఎంపిడిఓ సుబ్బరాయుడు, నాయకులు బోయళ్ళ నారాయణరెడ్డి, మనోజ్‌రెడ్డి, వెంకటాద్రి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలి



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 18)

మండల పరిధిలోని కొండేపి పకట్టవారిపాలెం రోడ్డు నందు కొండేపి సిఐ జి సోమశేఖర్, ఎస్ఐ ప్రేమ్ కుమార్, సిబ్బంది సమక్షంలో హెల్మెట్ ధరించిన వారికి స్పెషల్ డ్రైవ్ కండక్ట్ చేయడం జరిగింది. తప్పకుండా టూ వీలర్ నడిపే వారు, వారి వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, అదే విధంగా టు వీలర్ మీద హెల్మెట్ లేని వారిని కొండేపి మండలంలోకి అనుమతించకుండా తిప్పి పంపడం జరిగింది. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని ట్రాక్టర్లు డోర్లు ఓపెన్ చేసి ప్రయాణం చేయరాదని కూలీలను ట్రాక్టర్లను ఆటోలోనూ ఎక్కించుకొని ప్రయాణం చేయరాదని తెలపడం జరిగింది. ఈ విధమైన కార్యక్రమం రోజు జరుగుతుంది . కచ్చితంగా హెల్మెట్ లేని వారిని కొండేపి సర్కిల్ పరిధిలోని కొండేపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లోకి అనుమతించమన్నారు.

## నేర కట్టడిని పూర్తిగా అధిగమించాలి
## పట్టణంలో సీసీ కెమెరాలను పరిశీలించిన ఎస్ఐ వేమన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 18)

నేరాలను, ప్రమాదాలను కట్టడి చేయడానికి పట్టణంలో ఉన్న సీసీ కెమెరాలను ఎస్ఐ వి వేమన అనుక్షణం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఏ విధంగా పని చేస్తున్నాయో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి పట్టణంలో సుమారు 20 పైగా సీసీ కెమెరాలలో ఎప్పటికప్పుడు ప్రతి ఒక్క కెమెరాను పరిశీలిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కెమెరాల పై దృష్టి సారించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రధాన ప్రాంతాలలో ట్రాఫిక్, హోంగార్డుల విధులను సీసీ కెమెరాలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాల ద్వారా గమనిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఈవ్ టీజింగ్, తదితర నేరాలను కట్టడించే ఉద్దేశంతో పట్టణంలో కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంకా పట్టణంలో సుమారు 180 కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణగా నిలుస్తామన్నారు.

## వెంకట నారాయణ సేవలు మరువలేనివి
## ఆయన లేని లోటు తీర్చలేనిది
ఎరిక్షన్ బాబు






(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఫిబ్రవరి 18)

యర్రగొండపాలెం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కీ"శే" ఊట్ల వెంకట నారాయణ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ వెంకట నారాయణ గారి మృతి తీరని లోటని, వారి సేవలు ప్రభుత్వానికి, ప్రజలకు ఏంతో ఉపయోగకరమైనవని అయన తెలిపారు. వెంకట నారాయణ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు వెంకట నారాయణ సేవలను కొనియాడారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఎంపిడిఓ బి శ్రీనివాసులు, టీడీపీ కూటమి మండల పార్టీ అధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, నియోజవర్గ రైతు సంఘం అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, సర్పంచ్ మంత్ర నాయక్, వేగినాటి శ్రీను, పోక వెంకటసుబ్బయ్య, తదితర నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన

### బాపట్ల టౌన్ సీఐ రాంబాబు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 18) బాపట్ల జిల్లా ఎస్పీ తుషారి డూడి ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు నేతృత్వంలో బాపట్ల పట్టణ సీఐ రాంబాబు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల లో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థిని లకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు ర్యాగింగ్ పై పూర్తి అవగాహన కలిగివుండాలని అన్నారు అదేవిదంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి బాలికలకు పూర్తి అవగాహన కలిగించారు. మార్చిలో పదోవ తరగతి, ఇంటర్ వారికి పరీక్షలు ఉన్నందున ప్రతి ఒక్కరు బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ చంద్రవతి, కళాశాల ప్రిన్సిపాల్ భవాని దేవి, లెక్చరర్ విజయలక్ష్మి, లాయల్ శిరీష, కౌన్సిలర్ బేబీ, సుకన్య, చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ రేణుక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు సచివాలయంలో ఆధార్ సెంటర్ ఓపెనింగ్



(షణ్ముఖ వెలుగు, దొరవారి సత్రం, ఫిబ్రవరి 18) తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం కల్లూరు గ్రామపంచాయతీ సచివాలయ పరిధిలో మన కూటమి ప్రభుత్వం ఈరోజు నుంచి ప్రతి సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను పెట్టాలని ప్రజలకు అనుకూలంగా వారి వారి సచివాలయాల్లో మన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగినది . కల్లూరు సచివాలయంలో ఆధార్ సెంటర్ ఓపెనింగ్ జరిగినది ఎవరైనా ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్, పేరు, పుట్టిన తేదీ, అడ్రస్ ఇవన్నీ సరిలేకపోయినా మార్పు, చేర్పు సరి చేసుకోవాలన్నారు. ఈ అవకాశం ప్రజలు అందుబాటుగా సరి చేసూకోవాలని విజ్ఞప్తి చేశారు.



## ప్రభుత్వ హైస్కూల్లో ఘనంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18) మండల కేంద్రమైన ఉలవపాడు జి వి ఎస్ ఎమ్ ప్రభుత్వ హై స్కూల్ నందు లాంగ్వేజ్ డే సందర్భంగా మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమాన్ని ఘనముగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె మానస అద్వితీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆదాలత్‌కు 14 ఫిర్యాదులు తక్షణం నాలుగు సమస్యలు పరిష్కారం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18) ఒంగోలులో నిర్వహించిన విద్యుత్ అదాలత్ సిజిఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ అధ్యక్షతన జరిగింది. ఈ విద్యుత్ ఆదాలత్‌లో ఒంగోలు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, మద్దిపాడు, టంగుటూరు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని వినియోగదారులు విరివిగా పాల్గొని వారి యొక్క విద్యుత్ సమస్యలపై విన్నవించుకొని పరిష్కారం చేసుకున్నారు. విద్యుత్ ఆదాలత్‌కు 14 వరకు ఫిర్యాదులు రాగా తక్షణం 4 సమస్యలను పరిష్కారం చేశారు. విద్యుత్ అదాలత్‌లో కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ ఫారం సాంకేతిక సభ్యులు కె వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ సభ్యులు ఎ సునీత, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కే వెంకటేశ్వర్లు, ఈఈ మాకినేని హరిబాబు, ఒంగోలు టౌన్ డిఈఈ కే వి పి రంగారావు, రూరల్ డిఈఈ టి శ్రీకాంత్, ఒంగోలు డివిజన్ పరిధిలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, రెవెన్యూ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# నక్షా కార్యక్రమం పై దిశ, నిర్దేశం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, డిపార్ట్ మెంట్ ఆఫ్ ల్యాండ్ వారు పట్టణ భూ రికార్డులను ఆధునీకరించడం లక్ష్యంగా నక్షా( నేషనల్ జియా స్పేషియల్ నాలెడ్జ్ - బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) క్రింద భారతదేశంలోని 152 నగరాలు , పట్టణాలను ఎంపిక చేసియున్నారు. అందులో భాగముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 10 పట్టణ స్థానిక సంస్థలు ఎంపిక చేయబడ్డాయి. వాటిలో (ఏలూరు, కాకినాడ, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం, కుప్పం మునిసిపాలిటి). దేశ వ్యాప్తంగా నక్ష సర్వే ప్రారంభించేందుకు ఒంగోలు నగరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావును ప్రారంభించబడి, గంగాడ సుజాత, మేయరు, ఒంగోలు నగరపాలక సంస్థ వారి సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ రోణంకి గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్, ప్రకాశం జిల్లా పాల్గొన్నారు. నక్షా ముఖ్య లక్ష్యాలు సర్వే




అమలు పై దిశ నిర్దేశం చేశారు. శివరాజ్ సింగ్ చౌహాన్, అగ్రికల్చర్ , ఫార్మర్స్ వెల్ఫేర్ , రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిచే రైజన్ మధ్యప్రదేశ్ న ప్రారంభించిన పైలెట్ ప్రోగ్రామ్ ప్రత్యక్ష ప్రసారంను డిజిటల్ తెర మీద తిలకించారు. సదరు కార్యక్రమమునకు కమీషనర్ కోడూరు వెంకటేశ్వరరావు ఒంగోలు నగరపాలక సంస్థ, అనిత, డి.డి., సి.డి.యం.ఏ, విజయవాడ, ఉడా ప్లానింగ్ అధికారి, కె. బాబురావు, ఇన్ స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్లు , టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్స్, టి.పి.ఓ, బిల్డింగ్ ఇన్ స్పెక్టర్, వార్డు ప్లానింగ్ ,రెగ్యులేషన్ సెక్రెటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలు, వార్డు రెవిన్యూ సెక్రెటరీలు, పట్టణ ప్రముఖులు, ప్రజా నాయకులు, పట్టణ ప్రజలు సదరు నక్ష సర్వే కార్యక్రమానికి హాజరయ్యారు.





# హత్యకేసును ఛేదించిన కంభం పోలీసులు

### విలేకరుల సమావేశంలో డిఎస్పి నాగరాజు

### పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 18)

కంభం పట్టణంలోని తెలుగువీధిలో కలకలం రేపిన హత్య కేసును కంభం పోలీసులు అనతికాలంలోనే ఛేదించారు. డిఎస్పి నాగరాజు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం కంభం పట్టణంలోని జయప్రకాష్ వీధికి చెందిన మృతుడు కదం శ్యాంప్రసాద్ (36) లారీ క్లీనర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిస అయి తన సంపాదన మొత్తం మద్యానికే ఖర్చుపెట్టేవాడని మద్యం మత్తులో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడే వాడని గతంలో తన పిన్నీలతో అసభ్యంగా ప్రవరిస్తూ ఉండేవాడని ఊరి పెద్దలు తన తల్లి కదం లక్ష్మీదేవి తో కలిసి పంచాయతీ పెట్టి మందలించినా తన ప్రవర్తనలో మార్పు రాలేదని చివరికి తన తల్లి కదం లక్ష్మీదేవి పైన కూడా ఈనెల 8వ తేదీన అసభ్యంగా ప్రవర్తించాడని అన్న, తమ్ముడు కలిసి మృతుడు శ్యాంప్రసాద్ ని మందలించినా తన పద్ధతి మారలేదని తరువాత తన లారీ ఓనర్ తో గొడవ పడుతుండగా సమాచారం తెలుసుకున్న తల్లి తన మిగతా ఇద్దరు కుమారులతో కలిసి వెళ్లి ఇంటికి తీసుకొనివచ్చి నచ్చజెప్పి ఇంట్లో ఉంచుకున్నారని తరువాత ఈనెల 13వ తేదీన మళ్ళీ అధికంగా మద్యం సేవించి మళ్ళీ తన తల్లిపై అసభ్యంగా ప్రవర్తిస్తుండగా విసిగి పోయిన తల్లి అన్న తమ్ముడు మరో వ్యక్తితో కలిసి గొడ్డలి కత్తి తీసుకొని కదం శ్యాంప్రసాద్ ను హత్యచేసి శవాన్ని మాయం చేయాలని శవాన్ని 8ముక్కలుగా నరికి ఆ 8 ముక్కలను మూడు గోనె సంచులలో కుక్కి తన ఇంటికి దగ్గరలో ఉన్న నక్కల గండి కాలువలో పడేశారని పోలీసులు తెలిపారు. హంతకుల కోసం పోలీసులు గాలించి మంగళవారం ఉదయం 10గంటలకు కంభం మండలం నాగులవరం కి వెళ్లే దారిలోని రైల్వే గేటు వద్ద అరెస్ట్ చేశామని డిఎస్పీ తెలిపారు. కొద్దికాలంలోనే హత్య కేసు చేధించి ముద్దాయిలను అరెస్ట్ చేసిన మార్కాపురం డిఎస్పి నాగరాజు, కంభం సీఐ మల్లికార్జున ఎస్ఐ నరసింహారావును ప్రకాశంజిల్లా ఎస్పీ దామోదర్ అభినందించారు.



## పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయుటకు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి గీత

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

జిల్లా న్యాయసేవాధికార సంస్థ నెల్లూరు, మండల న్యాయసేవాధికార కమిటీలు గూడూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, వెంటగిరి, కోట, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరిలలో పారా లీగల్ వాలంటీర్లుగా (న్యాయసేవ సహాయకులు) పనిచేయుటకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి గీత ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఇంటర్, ఆపైన విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్ పోర్టు ఫోటోలు, రిజిష్టరు పోస్టు చేయుటకు సెల్ఫ్ అటెస్టెడ్ ఎన్వలాప్ కవర్ రూ.25 స్టాంపులతో జతచేసి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒక సంవత్సర కాలపరిమితితో భర్తీ అయ్యే ఈ పోస్టులకు ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు నిర్ధారించిన గౌరవ వేతనాన్ని అందిస్తామని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను “చైర్మన్ కం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయసేవా సదన్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంపౌండ్, నెల్లూరు వారికి రిజిష్టరు పోస్టు ద్వారా మాత్రమే పంపాలని సూచించారు. రిజిష్టరు పోస్టుపై “అప్లికేషన్ ఫర్ ఎంపానెల్‌మెంట్ ఆఫ్ పారా లీగల్ వాలంటీర్స్” అని రాయాలన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 26వ తేదీ సా.5 గంటలలోగా తమకు చేరేలా రిజిస్టర్ పోస్టు చేయాలని ఆమె పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఈ ఎంపికలు వుంటాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రజలకు చట్టపరంగా న్యాయ సహాయం అందించేందుకు ఆసక్తిగల పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ సేవకులు, లా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

## ఆలపాటి గెలుపుకి కృషి చేస్తున వేగేశన





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 18)

ఉమ్మడి గుంటూరు - కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మంగళవారం బాపట్ల నియోజకవర్గం బాపట్ల పట్టణంలోని ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ, సజ్జా హేమలత, బాపట్ల పట్టణ బిజెపి అధ్యక్షులు బాల నారాయణ, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉలవపాడు ట్రంకు రోడ్డుకి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను ఎప్పుడు తొలగిస్తారు సారు?

### గ్రామంలోనే ప్రజలు ఇబ్బందులు మీకు ఏమీ పట్టవా

### పేరుకి మాత్రం దండోరా వేపిస్తారు కానీ ఆచరణలో విఫలమైన గ్రామపంచాయతీ సిబ్బంది

### ఇప్పటికైనా స్పందించి ఆక్రమాలను తొలగించండి సారు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)




ఉలవపాడు గ్రామంలోనే అంబేద్కర్ విగ్రహం వద్ద మెయిన్ రోడ్డుకి. ఇరువైపులా దుకాణ యజమానులు రోజు రోజుకి ఆ రోడ్డును సైతం ఆక్రమించుకుని ముందుకు వస్తున్న కూడా పట్టించుకోవడం లేదు గ్రామ పంచాయతీ సిబ్బంది. గ్రామపంచాయతీ అధికారులు మండల స్థాయి అధికారులు ఒక విలేకరు వెళ్లి ప్రశ్నించగా ఆ విలేకరిపై దౌర్జన్యాన్ని దిగారు దుకాణ యజమాని. ఆ విలేకరి స్థానిక గ్రామపంచాయతీ అధికారులకు. సమాచారం ఇవ్వగా. కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. అంబేద్కర్ విగ్రహం వద్ద బస్సు దిగి పక్కకు వెళ్లాలన్న వెళ్లలేని పరిస్థితి. ఏర్పడిందని ముఖ్యంగా మహిళలు బాగా ఇబ్బంది పడుతున్న కూడా ఉలవపాడు మండల స్థాయి గ్రామ స్థాయి అధికారులకు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. పేరుకు మాత్రం దండోరా వేపిస్తున్నారు గాని, దాన్ని ఆచరణలో









పెట్టడంలో విఫ్లమయ్యారని ఉలవపాడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉలవపాడు మండల, గ్రామస్థాయి అధికారులు స్పందించి ట్రంక్ రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆక్రమణ తొలగించాలని ప్రజలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేయాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

# మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఏపి జెఏసి అమరావతి
### మహిళా విభాగం నిరంతరం పనిచేస్తుంది
### రాష్ట్ర అధ్యక్షురాలు పి లక్ష్మీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపి జెఏసి అమరావతి మహిళా విభాగం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షురాలు పి లక్ష్మీ తెలియజేశారు. ఒంగోలులోని ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సారధ్యంలో మహిళా విభాగం పనిచేస్తుందని అన్నారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న చోట మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వంలో మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులను రెండు సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి తమకు రావలసిన 25 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు అరియర్స్, డి ఎ, పి ఆర్, ఐ ఆర్ వంటి వాటిని సకాలంలో అందించేలా చూడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 21 జిల్లాలలో మహిళా కమిటీలను ఏర్పాటు చేశామని అందులో భాగంగా ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, ఒంగోలు, ఒంగోలు అర్బన్ డివిజన్లో మహిళా కమిటీలను నేడు నియమించడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లాలో మహిళా ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని జిల్లా అధ్యక్షులు జయలక్ష్మి సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ కమిటీ సభ్యులతో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి తోపాటు ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షులు పి. మధుసూదన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వాసుదేవ రావు, కోశాధికారి ఉతకొలు శ్రీనివాసరావు, కలెక్టరెట్ యూనిట్ అధ్యక్షులు సాయితో పాటు పలువురు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.






# ఎన్డీఏ ప్రభుత్వం నుంచి ముస్లిం మైనారిటీలకు సువర్ణ అవకాశం

### ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 18)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారని జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్ అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎఎన్ఎండీ ఫారుక్ విశేష కృషితో, ఇమామ్, మౌజ్జిన్‌లకు గౌరవ వేతనం విడుదలయ్యేలా చొరవ చూపారు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం రూ. 45 కోట్లు మంజూరు చేశారన్నారు. ఏప్రిల్ 2024, మార్చి 2025 వరకు రూ.15,000 గౌరవ వేతనం ప్రతి మస్జిద్‌కు అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ ద్వారా నిధుల పంపిణీకి జీవో జారీ చేశారన్నారు. ముస్లిం మత గురువులకు గౌరవ వేతనం మంజూరు చేసి, చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారనే విషయం మరోసారి నిరూపించారని తెలిపారు. ఈ గొప్ప నిర్ణయం తీసుకున్న సీఎం నారా చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనారిటీ మంత్రి ఫారుక్, ప్రభుత్వ సలహాదారులు ఎంఏ షరీఫ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# నవ వధువు ఆత్మహత్య



(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 18)

కంభం మండలం దేవనగరం గ్రామానికి చెందిన బిల్లా సుస్మిత 20 సంవత్సరాలు రుద్రపాటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో పెద్దారవీడు మండలం సిద్ది నాయుడు పల్లి గ్రామంలో ఈ నెల 16వ తేదీన వివాహం జరిగింది. 17వ తేదీ సాయంత్రం దేవనగరం గ్రామానికి వచ్చారు. 18వ తేదీ మంగళవారం మధ్యాహ్నం సమయంలో దేవనగరం గ్రామంలోని వాళ్ల బాబాయి ఇంట్లో నిద్రించడానికి వెళ్లిన బిల్లా సుస్మిత మధ్యాహ్నం భోజనానికి పిలవడానికి వెళ్లిన అన్న మహేష్ రూములో ఉరి వేసుకుని కనిపించింది. దీంతో చెల్లెలు ఉరి వేసుకుని చనిపోయిందని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటా హుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని కంభం పోలీసులు జరిగిన ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన బీజేపీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ఒంగోలులో వచ్చిన రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్‌ని ఎన్‌ఎస్పి గెస్ట్ హౌస్ నందు మర్యాద పూర్వకంగా కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడమనూరి కళ్యాణ్ చక్రవర్తి స్వాగతం పలికారు. ఆయనతో పాటు బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వై సి యోగయ్య యాదవ్, బాపట్ల జిల్లా ఇన్చార్జి పి వి కృష్ణారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివాజీ, తదితర బిజెపి నాయకులు కూడా ఉన్నారు.

# ఎస్‌హెచ్‌జిల ఆడిట్ సమర్ధవంతంగా నిర్వహించాలి

### డిఆర్డిఏ వెలుగు మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 18)

గ్రామాలలో స్వయం సహాయక సంఘాలకు చేసే ఆడిట్ ను సిఆర్పిలు సమర్ధవంతంగా నిర్వహించాలని డిఆర్‌డిఏ వెలుగు మార్కాపురం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఒంగోలు సుధాకర్ కోరారు. స్థానిక ఎస్సీబీసీ కాలనీలోని డ్వాక్రా బజార్ లో మార్కాపురం క్లస్టర్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలోని ఆడిట్ సిఆర్పిలకు మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్వయం సహాయక సంఘంలోని బ్యాంకు లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి వివరాలను సేకరించాలని కోరారు. సంఘాలలోని ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాల చెల్లింపు వివరాలు, పొదుపు ఖాతాలో ప్రతి నెల జమ చేస్తున్న నగదు వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆడిట్ సమయంలో సంయమనం పాటించి మీ దృష్టికి వచ్చిన విషయాలను సంబంధిత డిఆర్డిఏ వెలుగు అధికారులకు తెలియజేయాలని కోరారు. మార్కాపురం ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో లోటు పాట్లు ఏమైనా ఉంటే గుర్తించి సమాచారాన్ని నమోదు చేసుకొని అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రతి సభ్యురాలు జమ చెల్లింపులు వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎర్రగొండపాలెం క్లస్టర్ ఎల్ సి వెంకట్ రెడ్డి, మార్కాపురం క్లస్టర్ ఎల్సి నాగభూషణం, శ్రీనిధి మేనేజర్ సులోచన, సీసీలు నాగయ్య, మనో కుమారి, అకౌంటెంట్ నాగమణి, నాలుగు మండలాల ఆడిట్ సిఆర్పిలు పాల్గొన్నారు.






# కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవు

### మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 18)

కూటమి ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపులకు తావు లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం మాచర్ల నియోజకవర్గ పరిధిలోని కారంపూడి మండలంలో జూలకంటి బ్రహ్మారెడ్డి తో కలిసి శాసనమండలి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చేపట్టిన కార్యక్రమాల గురించి పట్టభద్రులకు వివరించడం జరిగిందని తెలిపారు పెన్షన్ పెంచడం పాటు ఉద్యోగస్తులకు ఒకటో తారీఖు నే జీతాలు వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ అందించడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారుల మరమ్మతుకు తట్ట మట్టి వేయలేదని తాము అధికారంలోకి రాగానే 1000 కోట్ల రూపాయలతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా తీర్చి దిద్దిన ఘనత గత పాలకులు కే దక్కుతుందన్నారు. వారు చేసిన నిర్లక్ష్యానికి ప్రభుత్వంపై కోట్లాది రూపాయల భారం పడిందని అన్నారు. వైసిపి అనాలోచిత నిర్ణయాల కారణంగా పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణం వ్యయం అమాంతంగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవస్థల అన్నింటినీ సర్వనాశనం చేశారని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో చర్చించి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి ఉక్కు ఫ్యాక్టరీకి జీవం పోశారని అన్నారు గత పాలకులు పథకాలు రావాలంటే పార్టీ కండువాలు వేసుకోవాలని ప్రజలను బెదిరించారని చివరికి ప్రజలు వారు ఏ కండువా వేసుకోకుండా చేశారని అన్నారు. ఒక్కసారి అబద్ధాలు చెప్పి జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి తీసుకుపోయాడని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరోసారి అబద్ధాలు చెబుతూ ప్రజల్లోకి వస్తున్నాడని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి కల్పనకు అలుపెరగని పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మద్దతుగా నిలిచేందుకు శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యతగా మాజీ మంత్రి ఆలపాటి రాజాకు వేసి గెలిపించాలని కోరారు.

# పునాది చదువులు భవితకు బాసటగా ఉంటాయి

### సీడీపీఓ నీలోఫర్






(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 18)

ఫౌండషన్ చదువులు బాలల భవితకు బాసటగా నిలిచి ఉంటాయని ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, సిడీపీఓ నీలోఫర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న 6రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సాల్ట్(సపోర్టింగ్ ఆంద్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్) కార్యక్రమంలో భాగంగా 120 రోజుల జ్ఞానజ్యోతి ఫౌండేషన్ లిటరసీ ,న్యూమరసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రీ ప్రైమరీ విద్యను బోధించే అంగన్వాడీ కార్యకర్తలలో బోధనా నైపుణ్యాలను మెరుగుపరుస్తూ, అభ్యసన ఫలితాలను సాధించవచ్చని, ఫౌండేషన్ విద్యను బలోపేతం చేయవచ్చని సీడీపీఓ నిలోఫర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి, ఆర్పీలుగా అంకిరెడ్డి, వేణుగోపాలాచారి రవికిషోర్ రెడ్డి, సీఆర్పీలు మురళీమోహన్ రవీంద్ర నాయక్, సూపర్వైజర్ చెంచులక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్ పెట్రోలియం భూములు ఇవ్వం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

ఉలవపాడు మండలంలోని కరేడు బస్టాండ్ దగ్గర మంగళవారం గ్రామస్తులు సమావేశమై భారత్ పెట్రోలియం వారికి ఎట్టి పరిస్థితులలో భూములు ఇవ్వరాదని తీర్మానించుకున్నారు. ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు ఆరువేల ఎకరాల అవసరమా అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ నాయకులు మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ సూపు ఉలవపాడు మండలంలోని సముద్రతీర గ్రామాలపై పడిందని వేల ఎకరాలను భారత్ పెట్రోలియం వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నించటం అన్యాయమని అన్నారు. ప్రధానమంత్రికి వత్తాసుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ మేఘాల మీద భూములు సర్వే చేయిస్తూ ప్రజల పొట్ట కొట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. త్వరలో మండలంలోని ప్రజలందరికీ సహకారంతో భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టబోతున్నామని శ్రీనివాసులు అన్నారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ భూములు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదులుకునే ప్రసక్తే లేదని శ్రీనివాస అన్నారు . ప్రభుత్వం వారిచ్చే ఉద్యోగాలు మాకొద్దు నష్టపరిహారాలు మాకు వద్దు అని సస్యశ్యామలమైన మా గ్రామాన్ని మా భూముల జోలికి రావద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . అవసరమైతే అమరావతిలో 30 వేల ఎకరాలు గతంలో ప్రభుత్వం తీసుకుని ఉన్నందున అక్కడ భారత్ పెట్రోలియం వారికి నిర్మించుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. అక్కడ ఒక సామాజిక వర్గాల వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని అక్కడ నిర్మించకుండా ఉలవపాడు మండలంలో నిర్మించడం ఏమిటంటే ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తాతాజీ రెడ్డి ,ఆల్బూరి కృష్ణ రెడ్డి ,షేక్ మాబు, మాజీ సర్పంచ్ సుబ్బారావు, గొల్ల పోతు బ్రహ్మయ్య ,దారా శ్రీనివాసులు ,సినీగే శ్రీనివాసులు ,చుండూరు శ్రీనివాస చారి ,గంజి కోటయ్య, పోటు కోటయ్య ,కొల్లి పెదకోటయ్య, బత్తుల వీర రాఘవరెడ్డి ,మావులూరి బాబు, పిగిలి భాస్కర్ ,కంజుల కోటిరెడ్డి ,మద్దెల శ్రీనివాసులు, సుదర్శన్ ,బాలకోటయ్య ,తదితరులు పాల్గొన్నారు.





## జ్ఞాన జ్యోతి కార్యక్రమం పై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 18)

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు మండల విద్యాధికారి రవిచంద్ర అధ్యక్షతన జ్ఞాన జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రవిచంద్ర మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు ప్రీప్రైమరీ స్కూళ్లలో బోధించడానికి జ్ఞాన జ్యోతి 120 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగనవాడి కార్యకర్తలు అందరికీ శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ,కుమార్, ఎంపీడీవో డాక్టర్ సుజాత, ఎంఈఓ 2 హరికృష్ణ, అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పెదపట్టపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

మండలంలోని పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్ కే సలీం భాష ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇంగ్లీషు ఉపాధ్యాయులు కె వి రాజు, అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంగ్లీషు భాష పట్ల విద్యార్థుల మక్కువను ఉపాధ్యాయులు కొనియాడారు.

## 100 కేజీల గంజాయి స్వాధీనం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

గత కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు నేషనల్ హైవే 16 మీదుగా చెన్నై నెల్లూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆదేశాలు మేరకు కందుకూరు ఎస్ డి పి ఓ. సిహెచ్ .వి బి .సుబ్రహ్మణ్యం సూచనల మేరకు కందుకూరు సిఐ కె.వెంకటేశ్వరరావు,ఉలవపాడు ఎస్ ఐ కె .అంకమ్మ. ఆధ్వర్యంలో మంగళవారం నిఘాలో భాగంగా ఎన్ హెచ్ 16 కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు దక్షిణ బైపాస్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడికి కొద్ది దూరంలో కందుకూరు సిఐ ఉలవపాడు ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా ఏపీ 30 టి ఏ 44 46 క్యాబ్ వాహనంలో గంజాయిని తరలిస్తున్న ముద్దాయిలు ఇల్లపు నాగేశ్వరరావు, తాడి నాగ సత్యనారాయణ, దుర్గారావు, పోలీసు వారిని చూసి వాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకునే సమయంలో ఏ3 దుర్గారావు తప్పించుకొని పారిపోయారు. మిగిలిన ఇద్దరినీ పట్టుకొని విచారించగా గంజాయి తరలిస్తున్నట్టు తేటతెల్లమైంది. దీంతో వారి వద్ద నుండి 95 ప్యాకెట్లలో 17,50,000 విలువ గల100 కేజీల గంజాయిని మూడు సెల్ ఫోన్ లను వాహనాన్ని స్వాధీనపరుచుకున్నారు. పరారీలో ఉన్న దుర్గారావు,ఆనంద వేలును అరెస్టు చేయాల్సి ఉందని, ముద్దాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని కందుకూరు డిఎస్పీ సిహెచ్‌విబి సుబ్రహ్మణ్యం తెలిపారు.

# పేదవారి విషయంలో పార్టీలకతీతంగా పనిచేయాలి

### సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, దొరవారి సత్రం, ఫిబ్రవరి 18)

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నియోజకవర్గస్థాయి హౌసింగ్ డిపార్ట్మెంట్ సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ఏర్పడిందని, దానికి అనుగుణంగానే పార్టీ పనిచేస్తుందని, గతంలో ఒక ఇంటికి రూ.1,80,000 మాత్రమే ఇచ్చే వారిని దానిని త్వరలో ఎస్సీలకు మరొక 50,000, ఎస్టీలకు రూ.70,000 అదనంగా అందిస్తారని తెలిపారు. అదేవిధంగా 2014-19 కాలంలో బిల్లులు పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఇంటి నిర్మాణం కోసం ఆన్లైన్ చేయడానికి మార్చి 31 వరకు ప్రభుత్వం గడువు తేదీ పొడిగించిందని, దీనిని ప్రతి ఒక్క పేదవారు వినియోగించుకోవాలని, పేదవారి విషయంలో పార్టీలకు అతీతంగా పని చేయాలని నాయకులను,అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి , మాజీ పార్లమెంటు సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, వేమసాని శ్రీనివాస నాయుడు, గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు, సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సంచి కృష్ణయ్య, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, మురళీకృష్ణారెడ్డి, బొమ్మన పళని, దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుంచేపల్లి, దాసల్లపల్లిలో పొలం పిలుస్తుంది








(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 18)

మండలంలోని కుంచేపల్లి, దాసల్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి వై గోపీచంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గోపీచంద్ మాట్లాడుతూ ఉద్యాన శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలైన కొత్త తోటల విస్తరణ, ప్లాస్టిక్ మల్చింగ్, నీటి కుంటలు, యాంత్రికరణ మొదలగు వాటికి రాయితీలు లభించుచున్నవి కనుక వాటిని రైతులందరూ వినియోగించుకోవలసిందిగా తెలిపారు. అలాగే డ్రిప్ మరియు ఫర్టిగేషన్ పద్ధతులు పాటించడం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని ఉద్యాన పంటలలో పొందవచ్చని తెలిపారు. మిరప మరియు ఉద్యాన పంటలను విచక్షణ రహితంగా పురుగుమందులు వాడకుండా ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలలోని నీటి కుంటలని,దానిమ్మ తోటలను పరిశీలించి తగు సూచనలు చేశారు.వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులను ఉద్దేశించి మండలంలోని రైతులందరూ త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదయ్యి 11 అంకెల నెంబర్ను కలిగి ఉండాలని తెలియజేశారు. ఇది భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఈ 11 అంకెల నెంబర్‌ను కలిగి ఉండాలని తెలియజేశారు. అదే విధంగా రబీ కాలంలో పంట నమోదు చేసుకున్న రైతులంతా ఈకేవైసీకి వేలిముద్రలు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారిణి డి సంధ్య, వ్యవసాయ అధికారి జైనులాబ్దిన్, ఏఈఓ అరుంధతి, విస్తరణ అధికారి ధనలక్ష్మి, గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 18)

మండలంలోని మాలపాడు గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు ఎస్ఐ అనుక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అనుక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని బాగా చదువుకొని సమాజానికి దేశానికి సేవ చేయాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని తెలియజేశారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ప్రోక్స్ యాక్ట్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పై , ఎవరైనా ఆకతాయిలు వెంటపడి వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయురాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## చెన్నమ్మకు అండగా జనసేన పార్టీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 18)

మండలంలోని చౌటపాలెం గ్రామానికి చెందిన గుత్తికొండ చెన్నమ్మ అనే మహిళకు పూర్వీకుల నుంచి భూమి వారసత్వంగా వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో గుత్తికొండ చెన్నమ్మకి తెలియకుండా ఆమె భూమిని మరొకరు ఆన్‌లైన్ పేరు నమోదు చేసుకోవడం జరిగింది. భూమి మాత్రం ఆమె ఆధ్వర్యంలో సాగు చేసుకుంటుంది కానీ పేరు మాత్రం ఆన్లైన్లో మరొకరు నమోదు చేసుకుని ఉన్నారని ఎందుకిలా జరిగింది అని చెన్నమ్మ వెళ్లి అడగగా ఆమెను బెదిరిస్తూ దుర్భాషలాడుతూ ఉన్నారు. ఈ భూ సమస్య మీద గత ఏడాది నుంచి బాధితరాలు అధికారులు చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదు. మంగళవారం న్యాయం కోసం జనసేన పార్టీ నాయకులను ఆశ్రయించారు. చెన్నమ్మకు న్యాయం జరిగే వరకూ జనసేన పార్టీ పోరాటం చేస్తుందని అని జనసేన పార్టీ కొండపి నియోజకవర్గం సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మండలం జనసేన పార్టీ నాయకులు యలమందల మాల్యాద్రి, తిరుమలరెడ్డి, పత్తిపాటి మాధవరావు, ఖాజావలి, గోగన చిన్నబాబు, నల్లపు పెద్ద బ్రహ్మయ్య, బిరుదుల దానయ్య, మువ్వా చిన్న పాల్గొన్నారు.

# శ్రీ మూలాస్థానేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### నెల్లూరు ఆర్‌డిఓ ఎన్ఎస్ అనూష



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

ఈ నెల 26 న మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలాస్థానేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నెల్లూరు ఆర్‌డిఓ ఎన్ఎస్ అనూష సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మూలపేట శివాలయ ఆవరణలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 21 నుండి మార్చి 5 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులు విశేషంగా హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ వారు శివాలయ పరిసర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్, మంచినీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, సైడ్ కాలువలను శుభ్రపరచుట తదితర పనులు చేయాలన్నారు. కోనేరును శుభ్రపరచడంతో పాటు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేయాలని సూచించారు. అదేవిధంగా శానిటేషన్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటుతోపాటు రథోత్సవం రోజున ప్రత్యేక రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్మెంట్ ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అంతరాయం లేని నిరంతర విద్యుత్ ప్రసారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా రథోత్సవం జరిగే అన్ని ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని మందులతో పాటు ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ఆర్డీవో, ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఎస్పీ సింధు ప్రియ, దేవాదాయ సహాయ కమిషనర్ జనార్దన్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, ఇంకా విద్యుత్, ఆర్ అండ్ బి, ఫైర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువు భూములతో వ్యాపారాలు చేస్తే సహించం

### రెవెన్యూ అధికారులు హెచ్చరిక





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువు భూములతో వ్యాపారాలు చేస్తే సహించమని అధికారులు పేర్కొన్నారు. కోవూరుపల్లి చెరువు పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారస్థుల చాలా మంది చెరువు భూములు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఈవిషయంపై కోవూరుపల్లి చెరువు పక్కన 335, 333 సర్వేనంబర్ రోడ్డు పక్కన వారికి ఇచ్చిన స్థలం 12 ఎకరాలు అయితే దానిని 50 ఎకరాలు చేసి చుట్టూ గోడలు కట్టి చెరువు మధ్యన గోడలు కట్టి ఉండగా ఈవిషయంపత్రికలలో కూడా రావడం జరిగిందన్నారు. దాని మూలంగా ఒక ఎకరా, రెండు ఎకరాలు తొలగించడం జరగగా దాదాపు పూర్తిగా తొలగించాలని రాష్ట్ర లోకయుక్తలో చెర్మన్ జస్టిస్ లక్ష్మరెడ్డి నాయకత్వంలో ఉన్న వారికి దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి ఫిర్యాదు చేయడం జరగగా మంగళవారం రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు , సచివాలయ అధికారులు, సర్వేనంబర్‌లలో కొలతలు తీసుకొని పరిశీలించారు. ఈకార్యక్రమంలో కోవూరుపల్లి రైతులు ఇందుపూరు రాము, నాటకరాణి భాస్కర్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి , ప్రసాద్, ఇంకా అనేకమంది పాల్గొన్నారు. బుధవారం కూడా సర్వే చేసి చెరువు భూములు అన్యాక్రాంతమైతే స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలియచేసారు.

## సంపూర్ణ ఆరోగ్యంతో ఎంపీ మాగుంట తిరిగి రావాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీతో మాట్లాడిన ఆయన అభిమానులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో మాట్లాడి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో బాగుండాలని, వైద్యుల సలహాలు తీసుకుంటూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు తిరిగి రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, బిట్స్- బెల్లంకొండ విద్యాసంస్థలు అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్స్‌కి 120 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 18)

ఉలవపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజున అంగన్వాడీ టీచర్స్‌కి ఇచ్చే 120 రోజులు శిక్షణ జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల విద్యాధికారులు శివ నాగేశ్వరరావు, రమణయ్యను ప్రారంభించారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ కే రమేష్, జి రమేష్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంగన్వాడి రిసోర్స్ పర్సన్స్ అంజమ్మ, విజయలక్ష్మి, నాగలక్ష్మి లు శిక్షణ మంది అంగన్వాడీ టీచర్స్ శిక్షణ తీసుకుని ఎందుకు వచ్చారు. శిక్షణ, భోజన వసతి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం

### శివాలయం కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 18)

పొదిలిలో శివరాత్రి పర్వదిన సందర్భంగా మంగళవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్చి 3వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాలలో శివరాత్రి పర్వదినాన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 27వ తేదీన రథోత్సవం సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటారని, పోలీసులు, ఇతర శాఖల అధికారుల సహాయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో శివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు త్రాగునీరు, ఎండలో దర్శనానికి ఉన్నవాళ్లకి నీడను ఏర్పాటు చేసి స్వామివారి దర్శనానికి ఏ ఇబ్బంది లేకుండా కల్పిస్తామన్నారు. శివరాత్రి పర్వదినాన, ఈ బ్రహ్మోత్సవాలు, రథోత్సవం రోజున ఏవైనా భక్తులకు సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కోరారు.











## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 18)

పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రవేశపెట్టారని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రక్త పరీక్షలు చేయు ల్యాబ్ ను పరిశీలించి ప్రజలు ఫిర్యాదు మేరకు గడచిన ఏడు నెలల నుండి రక్త పరీక్షలు చేయడం లేదని తెలుపగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రక్త పరీక్షలు చేయు నిపుణులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకోగా రక్త పరీక్షలకు సంబంధించిన మందులు లేకపోవుట వలన పరీక్షలు చేయలేకపోయామని వారు తెలిపారు. ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అర్బన్ ప్రాథమిక వైద్యశాలలో రక్త పరీక్షలకు సంబంధించిన మందులు వెంటనే సమకూర్చినట్లయితే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్లను ఓ పి రిజిస్టర్‌ను పరిశీలించి ప్రతి రోజు ఎంత మంది పేషెంట్లకు వైద్యం అందిస్తున్నారని సంబంధిత ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 7గురు విధులకు హాజరై ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారు మిగతా వారు ఎక్కడకి వెళ్లారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యాధికారులు పేదప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య అధికారులు విధులు పట్ల అలసత్వం వహించి పేద ప్రజలకు వైద్యం అందించకపోతే ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## అక్షర కాలేజీ 15వ వార్షికోత్సవ వేడుకల్లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, పువ్వాడి, యారవ









(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 18)

పామూరు పట్టణం లోని గత 15 సంవత్సరముల నుండి అత్యధిక మంది విద్యార్థులతో ముందుకు సాగుతున్న అక్షర జూనియర్ కాలేజ్ 15వ వార్షికోత్సవ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులు అన్ని రంగంలో రాణించి మంచి బంగారు భవిష్యత్తుకు బాట వేయాలని ఆయన అన్నారు. పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు గర్వించ దగ్గంగా విద్యార్థులు ఎదగాలని ఆయన అన్నారు. అనంతరం అక్షర జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ కదిరి బాబు రంగారావు మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న పామూరు పట్టణం నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో నిలబడడానికి కారణం మా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అని ఆయన అన్నారు. 15 సంవత్సరముల నుండి మా విద్యాసంస్థలకు సహకరించిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు విద్యార్థిని, విద్యార్థులకు నా సంస్థ రుణపడి రుణపడి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు, హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్ షేక్ రఫీ, అడుసుమల్లి ప్రభాకర్, ఆదిత్య కాలేజ్ ప్రిన్సిపాల్ లింగం శెట్టి వెంకట నారాయణ, పామూరు పట్టణ అధ్యక్షులు ఖాజా రంతుల్ల, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## కొండపల్లి పర్యాటక శాఖ ఆస్తులను కాపాడేందుకు కృషి

### ఏపి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

### బాలాజీ ఆదేశాల మేరకు ముందుకు కదిలిన ఏపీటీడీసీ యంత్రాంగం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 18)

ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమ ప్రాంతంతో పాటు, కొండపల్లి జర్నలిస్టు కాలనీ సమీపంలో ఉన్న ఏపీ టూరిజం స్థలాన్ని గత శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. చైర్మన్ సందర్శన సమయంలో, ముళ్ల పొదలతో నిండి ఉన్న ప్రాంతాన్ని గమనించి, వెంటనే శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టి, చెత్త చెదారం , ముళ్ల కొంపలను తొలగించి, ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చారు. ఈ ప్రాంతంలో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చైర్మన్ సూచించారు. పర్యాటకుల సౌకర్యార్థం బెంచీలు, పార్కింగ్ స్థలం, మరుగుదొడ్లు మరియు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే, ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు లాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మారనుందని చైర్మన్ తెలిపారు. కృష్ణా జిల్లాలోని ఇబ్రహీంపట్నం ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో జార్జి విద్యార్థుల ప్రతిభ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 18)

స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మార్కాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఎస్ఎస్ఎన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనుపరచారు. ఎస్వీకేపీ మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు అని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలు కెప్టెన్ సుబ్బు, టీం సభ్యులను, ఫిజికల్ డైరెక్టర్లు జయరావు, విక్రమ్, కోచ్ పోలయ్యలను కళాశాల సాంకేతిక సలహాదారు ,మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభినందించారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విజేతలకు రూ. 5000ల నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు 11 కోట్ల విరాళం



(షణ్ముఖ వెలుగు, తిరుపతి, ఫిబ్రవరి 18)

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు 11 కోట్ల భారీ విరాళం అందింది. ముంబైలోని ప్రసీద్ యూనో ఫ్యామిలీ ట్రస్ట్కు చెందిన తుషార్ కుమార్ డొనేషన్ డీడీని టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. ఈ సందర్భంగా తుషార్‌ను వెంకయ్య సన్మానించి, అభినందించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# నిబంధనలను పాటించని గ్రానైట్ క్వారీలు, పాలిషింగ్ యూనిట్లను సీజ్ చేయండి

## సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 18)

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటించని గ్రానైట్ క్వారీలను,పాలిషింగ్ యూనిట్లను సీజ్ చేయాలని సిపిఎం జిల్లా నాయకులు పి వి శేషయ్య ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరారు. కనిగిరి గార్లపేట రోడ్డు నందలి గ్రానైట్ క్వారీ , పాలిషింగ్ యూనిట్ యజమానులు తమ ఫ్యాక్టరీ నందలి వ్యర్ధాలను రోడ్డుపైకి తరలిస్తున్నందున, రోడ్డు కుంచిన్చుకుపోవడమే కాకుండా, రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఈ సమస్య తీవ్రతపై 2023 ఏప్రిల్ 9 న ఆర్ అండ్ బి అధికారులను, ఏప్రిల్ 18న కనిగిరి ఆర్డీవోకి వామపక్ష ప్రజాసంఘాలు వినతిపత్రం అందించడం జరిగింది. దీంతో ఆర్ అండ్ బి అధికారులు ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న 11 గ్రానైట్ కంపెనీలకు 25.4.2023 న నోటీసులు అందజేయడం, ఆ వెంటనే తమ కార్యాలయం నందు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా మైన్స్ అధికారులు కూడా హాజరయ్యారు. సమస్య తీవ్రతను, ప్రజలు పదేపదే చేస్తున్న ఫిర్యాదుల గురించి చర్చించారు. ఇకపై గ్రానైట్ క్వారీ , పాలిషింగ్ యూనిట్ యజమానులు, తమ సొంత డబ్బులతో భూమి కొనుగోలు చేసుకుని, క్వారీ గ్రానైట్ వ్యర్థాలను సొంత డంపింగ్ యార్డులకు చేర్చాలని, రోడ్డు మీదకు తరలించరాదని ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు ఆరు నెలలపాటు పని చేశాయి. అనంతరం పరిస్థితి యథాస్థితికి చేరింది. శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడలేదు.ఇటీవల స్థానిక శాసనసభ్యుల దృష్టికి ప్రజలు ఈ సమస్యను తీసుకురావడం, వెంటనే సంబంధిత అధికారులు, క్వారీ మరియు పాలిషింగ్ యజమానులతో సమావేశం నిర్వహించి చర్చించడం జరిగింది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మైన్స్ అధికారులు ఆడుతున్న నాటకాలను కట్టిబెట్టాలని పివి శేషయ్య అన్నారు. పర్యావరణ నిబంధనలను పాటించని గ్రానైట్ క్వారీలను పాలిసింగ్ యూనిట్లను తక్షణమే సీజ్ చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. 22.4.2022 న కంపెనీ చట్టం కింద నమోదైన 11 కంపెనీలకు, నేడు గ్రానైట్ కంపెనీల వద్ద యజమానులు ప్రదర్శించిన తమ కంపెనీల పేర్లకు పొంతన లేదన్నారు. 2024 డిసెంబర్ నాటికి ప్రభుత్వ అనుమతులతో నడుపుతున్న కంపెనీల పేర్లను బహిరంగంగా ప్రకటించాలని, బినామీ పేర్లతో నడుస్తున్న కంపెనీలను నిషేధించాలని ప్రభుత్వ ఉన్నతాధికారులను సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య కోరారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే జూలకంటికి ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల, ఫిబ్రవరి 18)

కారంపూడి మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ తిరునాళ్ల మహోత్సవంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే జూలకంటికి గ్రామస్తులు పూలు చల్లుకుంటూ బ్రహ్మరథం పట్టారు. ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను తిరునాళ్ల జరిగే తీరు గురించి మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వివరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి లకు వేద ఆశీర్వచనాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## బార్ అసోసియేషన్ నాయకులతో ఎమ్మెల్యే జూలకంటి సమావేశం




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 18)

ఈ నెల 27వ తేదీన జరగనున్న కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ప్రచారాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం నిర్వహించారు. మాచర్ల మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ అనేక ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్ డి ఏ ఆధ్వర్యంలో అహర్నిశలు పాటుపడుతున్నారు అని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను నిర్మూలించేందుకు పారిశ్రామికవేత్తలతో అవిశ్రాంతంగా చర్చలు జరుపుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక పరిశ్రమలు రాష్ట్రం నుండి తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి నిధులు సేకరించడం జరుగుతుందని పలు అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పథకాలు కొనసాగుతూ ఉండాలంటే విద్యావేత్తలు మేధావులు ఎన్డీఏ కూటమికి మద్దతు పలకాలని ఆయన కోరారు.

## రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

### మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 18)

మండలంలోని రైతు సోదరులనుద్దేశించి మండల వ్యవసాయ అధికారి, కే బుజ్జి బాయి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి పలు విషయాలను వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుంది. పొలము ఉన్న ప్రతి రైతు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేపించుకోవాలన్నారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమంగా పేర్కొన్నారు.

## విద్యార్థిని వేమినేని వెంకట వసంతకు ఆర్థిక సాయం

### రూ.10 వేలు సాయం అందజేసిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 18)

అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయిన విద్యార్థిని వేమినేని వెంకట వసంతకు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తక్షణమే రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో అద్దాలు తీసుకోవడానికి వచ్చిన వెంకట వసంతను జిల్లా కలెక్టర్ స్కూలుకు యూనిఫామ్ వేసుకుని ఎందుకు రాలేదని అడిగారు. వెంటనే విద్యార్థి బాపట్లలో అగ్ని ప్రమాదంలో తమ ఇల్లు కాలిపోయిందని వేసుకోవడానికి యూనిఫామ్ లేదని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మనసు చలించిపోయి విద్యార్థిని వెంకట వసంతకు వారి కుటుంబానికి రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసిల్దార్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.





## రైతులంతా విశిష్ట గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలి

### ఏ ఓ వెంకటేష్





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఫిబ్రవరి 18)

మండలంలోని చిమట, రామాయపాలెం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులంతా 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉన్నవారికి భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుతాయని తెలియజేశారు. రైతులంతా త్వరితగతిన మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులచే ఈ విశిష్ట గుర్తింపు నెంబర్ కోసం నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ గుల్లసముద్రం, కెల్లంపల్లి గ్రామాల రైతు సేవా కేంద్రాలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేసి, రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య మీద అవగాహన కల్పించారు.

## మహా శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

### భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు

### యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 18)

త్రిపురాంతకం పట్టణంలోని శ్రీ బాల త్రిపురసుందరి దేవి అమ్మవారి సన్నిధిలో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లపై నిర్వహించిన 2వ సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి ఉత్సవ గోడ పత్రికను ఎరిక్షన్ బాబు గారు ఆవిష్కరించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, దేవాలయ కమిటీ పాల్గొన్నారు.

## అంగన్వాడీ స్కూల్ టీచర్‌లకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 18)

కొండపి ప్రభుత్వ హైస్కూల్లో ప్రైమరీ స్కూల్స్ ఒకటి, రెండు అంగన్వాడీ స్కూల్స్‌కు సంబంధించి టీచర్లకి జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఆట,పాటలతో పిల్లలకి నాణ్యమైన విద్య నేర్పించే విధంగా టీచర్ల బృందం అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం నుండి శనివారం వరకు శిక్షణ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కొండపి ఎమ్ఈవో సురేఖ, ఎంఈఓ 2 రామారావు తెలిపారు. శిక్షణలో ఉపాధ్యాయులు వసంతరావు, చంద్రశేఖరరావు, హనుమంతరావు పాల్గొని టీచర్ల శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ విక్టోరియా రాణి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, టీచర్లు పాల్గొన్నారు.

## సింగంశెట్టి అశోక్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

నెల్లూరు మెడికవర్ హాస్పిటల్లో అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్న 14 డివిజన్ వైసిపి నాయకులు సింగంశెట్టి అశోక్‌ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సింగంశెట్టి అశోక్ ఆరోగ్య పరిస్థితి గురించి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసానిచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి వెంట జిల్లా యువజన అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైసిపి నాయకులు గిరి రెడ్డి, సాకేష్ రెడ్డి, మహేష్, సలాం, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి భేటీ

### నెల్లూరు కి సంబంధించి పలు రాజకీయ అంశాల పై చర్చ






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

నెల్లూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా కార్యాలయంలో వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డితో చంద్రశేఖర్‌రెడ్డి పలు రాజకీయ అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.

## రెడ్ క్రాస్ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలి

### జిల్లా కలెక్టర్‌కు కాకాణి లేఖ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 18)

రెడ్ క్రాస్ విషయంలో పక్షపాత వైఖరితో కాకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు విజ్ఞప్తి చేశారు మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెడ్ క్రాస్‌లో రాజకీయ జోక్యం ఉండకూడదంటూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులకు నోటీసులు ఇవ్వడం, వారిని తొలగించడం, తెలుగుదేశం పార్టీ వారికి సంబంధించిన సభ్యులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడాన్ని ప్రశ్నిస్తూ, జిల్లా కలెక్టర్ చర్యలపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, జిల్లా కలెక్టర్ బహిరంగ లేఖ ద్వారా విన్నవించారు కాకాణి.